క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: దత్త జయంతిని పురస్కరించుకుని ఆదివారం శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ చేశారు. అనంతరం స్వామివారికి పంచామతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి కర్పూర హారతులు ఇచ్చారు.

గూడెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో గిరిజనులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని నెమళ్లకుంట చెంచుగూడెంలో పాస్టర్ జాన్ ఎవాంజలిస్ట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. గూడెం వాసులతో ప్రార్థనలు జరిపించి కేక్ కట్ చేశారు. నూతన వస్త్రాలు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బ్రదర్ శేఖర్, సుందర్ రావు, స్టీఫెన్ పాల్గొన్నారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎద్దులు



పోటీ పడుతున్న ఎద్దులు

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో వెలసిన కాశినాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగుడు పోటీలు జరిగాయి. పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ప్రలగం ప్రతిజ్ఞరెడ్డి, జస్వితరెడ్డిల ఎడ్లు మొదటి స్థానంలో నిలువగా నగదు బహుమతి రూ.60,116 అందజేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరస్వామిచౌదరి ఎడ్లజత ద్వితీయ స్థానంలో నిలవగా రూ.50,116 అందించారు. అలాగే నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు తృతీయ స్థానం సాధించగా రూ.40,116 బహుమతి ఇచ్చారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గారటికె నాగిరెడ్డి ఎడ్లజత నాలుగో స్థానంలో నిలువగా రూ.30,116 బహూకరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రవి, రమేష్ సొంత పని నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్ల వచ్చారు. కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలం కొత్తకోటకు చెందిన సుదర్శన్ కలుగొట్లలోని కాశీనాయన ఆరాధనోత్సవాలకు వచ్చి తిరిగి బైక్‌పై వెళుతుండగా కోవెలకుంట్ల మండలంలోని జోళదరాశి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



శింగనపల్లె సమీపంలో కాలువలోకి దూసుకెళ్లిన బొలెరో

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామ సమీపంలో ఆదివారం బొలెరో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుకు నుంచి బొలెరో మ్యాక్స్ ట్రక్‌లో పోట్ల కట్టెలను వేసుకొని సుంకేసుల గ్రామానికి వెళ్తుండగా శింగనపల్లె గ్రామ సమీపంలో ఓ విద్యార్థి మోటర్ సైకిల్‌పై అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చాడు. బొలెరో డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించే క్రమంలో వాహనం పక్కనే ఉన్న మోరీని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లింది. బైక్‌పై వచ్చిన విద్యార్థి సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విద్యార్థిని వెంటనే అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలెరో వాహనం డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించకపోయి ఉంటే విద్యార్థికి పెద్ద ప్రమాదం జరిగిఉండేదని స్థానికులు తెలిపారు.

దర్జాగా పంట కాల్వ కబ్జా !

- రుద్రవరం గ్రామంలో ముగ్గురు రైతుల నిర్వాకం
- పొలాలకు నిలిచిపోయిన సాగునీరు
- అధికారులకు విన్నవించినా కరువైన స్పందన
- ఆందోళన చెందుతున్న సన్నకారు రైతులు



సాగు నీరు అందక ఎండిపోతున్న మినుము పంట



పంట కాల్వను పూడ్చిన ప్రాంతం



దిగువన ఉన్న పంట కాల్వకు అడ్డుగా కట్ట వేసిన దృశ్యం

పాములపాడు: కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి. మండల పరిధిలోని రుద్రవం గ్రామంలో ఏకంగా పంట కాల్వ కబ్జా చేసిన తీరు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. పంట కాల్వ పక్కన పొలాన్ని కొనుగోలు చేసిన ముగ్గురు రైతులు సమీపాన ఉన్న కాల్వను ఆక్రమించారు. కాల్వను పూడ్చి ఈ భూమి మాదే అంటుండడంతో సమీప రైతులు లబోదిబో అంటున్నారు. కేసీ కెనాల్ నుంచి అనుబంధంగా గుడిపాల్ల పంట కాలువ క్రింద పూర్వం నుంచి సుమారు 200 ఎకరాలకు సాగు నీరు సరఫరా అయ్యేంది. ఈ కాల్వనీరు మండలంలోని లింగాల గ్రామ సమీపంలోని భవనాశి నదిలో కలిసేది. అయితే ఎస్ఆర్ఎంసీ కాలువ నిర్మాణంతో సంబంధిత భూములు ముంపునకు గురయ్యాయి. ఇక కేవలం 30 ఎకరాలు మాత్రం సాగుకు అనుకూలంగా ఉంది. ఈ భూములకు గుడిపాల్ల పంట కాలువ నుంచి సాగునీరు సరఫరా అవుతుంది. అయితే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పంట కాల్వను ఆనుకొని ఉన్న 20సెంట్ల స్థలాన్ని నాన్ రిజిష్టర్ ద్వారా కొనుగోలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా పంట కాల్వలను పూడ్చేసి కబ్జా చేశారు. కబ్జాదారులకు రాజకీయ బలం ఉండడంతో ప్రశ్నించే నాథుడు కరువయ్యారు. దాదాపు 30 ఎకరాలకు సంబంధించిన సన్నకారు రైతులు దిక్కుతోచడం లేదు. కొన్ని వందల సంవత్సరాల నుంచి ఉన్న పంట కాల్వను ఎలా పూడ్చివేస్తారని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు కబ్జాదారులు.

అధికారులకు వినతులు సమర్పించినా... నిరసనలు తెలిపినా...

పంట కాల్వ కబ్జాకు గురవ్వడంతో రైతులకు సాగు నీరు కరువైంది. కబ్జాదారులను ప్రశ్నించే ధైర్యం లేకపోవడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ తో పాటు ఇరిగేషన్ అధికారులకు సమస్యను విన్నవించారు. కాల్వను పరిశీలించి న్యాయం చేయాలని వినతి పత్రాలు సమర్పించారు. చివకు నిరసన తెలిపినా అధికారుల నుంచి స్పందన లేదు. బాధిత అన్నదాతలకు న్యాయం జరగలేదు.

ప్రశ్నార్థకంగా సాగు

గుడిపాల్ల పంట కాలువను పూడ్చడంతో రుద్రవరం సన్నకాలరు రైతులకు సంబంధించి సుమారు 30 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. సర్వే నంబరు 518,519, 521, 554లలో 5 మంది రైతులకు చెందిన 15 ఎకరాలకు సాగునీరు నిలిచిపోయింది. ఇదే అదునుగా భావించిన మరో రైతు పైన కాల్వ పూడ్చడంతో తన పొలంలోకి నీరు అధికంగా ప్రవహించి పంట మునిగి పోతుందని కాల్వకు తన కూడా అడ్డుగా కట్ట నిర్మాణం చేపట్టాడు. దీంతో నీరు ఎక్కువై సర్వే నంబర్లు 540, 541, 521, 539, 519, 568, 569 సంబంధించి 6 మంది రైతులకు చెందిన సుమారు 15 ఎకరాలు మునకకు గురవుతోంది. దీంతో పంట సాగు కష్టతరంగా మారింది.

పంటలు ఎండిపోయాయి



పంట కాల్వ పూడ్చి వేయడంతో ఒక ఎకరా నీరులేక ఎండిపోయింది. మరో ఎకరా నీరెక్కువై మునిగి పోయింది. దీంతో గతేడాది పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. దాదాపు రూ.2లక్షలు నష్టపోయాను. అధికారులు స్పందించి పంటకాలువను పరిశీంచి న్యాయం చేయాలి.

–మల్లికార్జున, రైతు,రుద్రవరం

ప్రతి సంవత్సరం కాల్వ పూడిక తీసేవారు...

ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఉపాధి హామీ పనుల్లో భాగంగా పంట కాల్వలో పూడికతీత పనులు చేపట్టేవారు. నాకు 21/2 ఎకరాల పొలం ఉంది. కాల్వను కబ్జా చేసిన వారితో ఎంతగా మాట్లాడినా వినడం లేదు. అధికారులే మాకు న్యాయం చేయాలి. ఇలాగే ఉంటే పొలాలు బీళ్లుగా మారతాయి. ఈ సంవత్సరం వర్షం పడటంతో విత్తనాలు వేసుకున్నాం. అధికారుల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. నీరు పెట్టకపోతే పైర్లు ఎండిపోతాయి.

–శివ, రైతు, రుద్రవరం

రాజకీయం చేస్తున్నారు



ఈ సమస్యను రాజకీయం చేస్తున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చూస్తున్నాం. నాకున్న రెండెకరాలలో మినుము సాగు చేశా. ఇప్పుడు నీరు పెట్టకపోతే నాశనం అవుతుంది. సారొళ్ల చుట్టూ తిరుగుతున్నాం. సారొళ్లే మాకు న్యాయం చేయాలి.

–రామకృష్ణ, రైతు, రుద్రవరం

సమస్య నా దృష్టికి వచ్చింది



బాధిత రైతులు ఇటీవలే నా దృష్టికి సమస్యను తెచ్చారు. ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించిన తరువాత పూర్తి విచారణ చేస్తాం. అప్పుడే నిర్ణయం తీసుకోగలం. అన్నివిధాలుగా పరిశీలించిన రైతులు నష్టపోకుండా చూస్తాం.

–సుభద్రమ్మ, తహసీల్దార్, పాములపాడు

రేపు జాబ్‌మేళా

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేవీకే స్టేడియం కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంతరెడ్డి ఆదివారం తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చదువుకుని ఖాళీగా ఉన్న యువత కోసం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. డిక్సాన్ టెక్నాలజీస్, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ ఎఫ్ఐఎల్, అరబిందో ఫార్మా ఫ్యూచర్ ప్రాపర్టీకి చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 6303244165, 7673902328 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మహానందిలో ఆడిట్

మహానంది: మహానంది దేవస్థానంలో సోమవారం నుంచి ఆడిట్ జరగనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆడిట్ విభాగం ఆధ్వర్యంలో అన్ని విభాగాల ఆదాయ, వ్యయ అంశాలపై అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, నంద్యాల వారి ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించనున్నారు. రిజిస్టర్లు, డీసీబీ, స్టేట్‌మెంట్స్, బ్యాంక్ స్టేట్మెంట్స్, జమ, ఖర్చుల ఓచర్లు, స్టాక్‌రిజిస్టర్లు, తదితర వాటిని పరిశీలించి ఆడిట్ నిర్వహిస్తారు. ఇప్పటికే అన్ని విభాగాల ఫైళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి సంబంధిత ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశారు.

దుకాణాల్లో చోరీ

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని కర్నూలు రోడ్డులో ఉన్న మూడు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి అనంతరం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం యథావిధిగా దుకాణాలను తెరిచేందుకు వచ్చిన దుకాణదారులు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. శివసాయి ట్రాక్టర్ స్పేర్స్ దుకాణంలో రూ.25వేలు, టీ దుకాణంలో రూ. వెయ్యికి పైగా విలువ సిగరెట్ పాకెట్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా

ఆత్మకూరు: క్రీడల్లో రాణిస్తే గుర్తింపుతో పాటు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ క్లబ్, ఆత్మకూరు బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్నేహపూర్వక మ్యాచ్‌లో ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా పస్పిల్ మున్నా మాట్లాడుతూ..పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్‌లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి తరుణంలో సీనియర్ క్రీడాకారులు ఆటలను బతికించుకునేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో క్రీడలకు పూర్వవైభవం తెచ్చేలా కృషి చేస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు, క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు సహకారం అందించనున్నట్లు తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో కేవీకే స్టేడియంతోపాటు స్పోర్ట్స్ క్లబ్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆత్మకూరు, జూపాడుబంగ్లా, అబ్దుల్లాపురం, పాములపాడు జట్ల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో రైల్వే వాలీబాల్ కోచ్ నిమ్మకృష్ణ యాదవ్, కబడ్డీ కోచ్ వెంకటేష్‌గౌడ్, తైక్వాండో కోచ్ స్వామన్న, ఖోఖో కోచ్ మహబూబ్ బాషా, సీనియర్ క్రీడాకారులు వెంకటేశ్వరావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు: పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ఛలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టిన రైతులపై టియర్ గ్యాస్ వాటర్ కెనాల్స్ ప్రయోగించడం దారుణమని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని హర్యానా పోలీసులు మూడోసారి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. శంభు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన రైతులపై బాష్పవాయువు ఉపయోగించి జల ఫిరంగులతో రైతులను చెల్లాచెదురు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసుల దాడిలో 17 మంది రైతులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రైతులకు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. నాయకులు గోపాల్, శివ, ఎల్లనాయుడు, పుల్లన్న పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం



వేలం పాటలో పాల్గొన్న రైతులు

నందికొట్కూరు: ఈ ఏడాది షరాఫ్ వేలం ద్వారా ఆదాయం పెరిగిందని రైతు సంఘం అధ్యక్షుడు గుంజుపల్లి చిన్న పుల్లారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పెద్ద బజారులోని రైతు సంఘం కార్యాలయం వద్ద షరాఫ్ వేలం పాటలో రూ.7.51 లక్షలకు పి. ముర్తుజావలి దక్కించుకున్నారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో పంట పొలాలకు రక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. 8 మంది కావలికాడులను నియమించి ప్రతి నెలా ఒక్కొక్కరికీ నెలకు రూ. 9 వేల చొప్పున ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు.

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



నందికొట్కూరులో.....

నందికొట్కూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, పుల్యాల నాగిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ, ఆర్య వైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్, రవి, రాజు, రవికుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చు శ్రీనివాసులు, పార్థసారథి, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏఓ ఉమర్, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగి కళ్యాణ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

వెలుగోడు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య నాయకులు బల్లాని వెంకట సత్యనారాయణ, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన సమరయోధుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లాలం రమేష్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లూరి రవికుమార్, నాగేళ్ల సుబ్రమణ్యం, లాలం నాగార్జున, లాలం సుధాకర్, లాలం జనార్దన్, బలుసా రాము, కుమార్ లాలం, మల్లికార్జున, మారం సంపత్ కుమార్, బొగ్గరపు లక్ష్మీ నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న అధికారులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం



పాములపాడు: నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గోపాల్



పగిడ్యాల: పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పాములపాడు: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రమని ప్రధానోపాధ్యాయుడు గోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరజీవి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు విడిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. మహోన్నతుల జీవిత చరిత్ర గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డి.రవి, హెచ్‌డబ్ల్యు అనిత విద్యార్థులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

పగిడ్యాల: తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎంపీడీఓ సుమిత్రమ్మ కొనియాడారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, ఎంపీడీఓ, తహసీల్దార్, పాఠశాలల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సత్యం, అహింస మార్గంలో నడిచి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడయ్యారని కొనియాడారు. అమరజీవి ప్రాణ త్యాగం వల్లే 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంట్‌లో ప్రకటించారని తెలిపారు. రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి భావితరాలకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. నేటి యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, కాసీం, వీరన్నయాదవ్, లక్ష్మీనారాయణమ్మ, కోట్ల వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టితవ్వకాలు!



ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వుతున్న ప్రొక్లెయిన్

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణం కోసం పీఎస్‌కే కంపెనీ వారు ఇష్టానుసారంగా మట్టితవ్వకాలు చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని తంగడంచ గ్రామశ్మశాన వాటికకు సమీపంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో యథేచ్ఛగా మట్టితవ్వి రోడ్డు నిర్మాణం కోసం తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారంగా మట్టితవ్వకాలకు తహసీల్దార్ నుంచి ఎన్‌ఓసీ తీసుకుని మైనింగ్ అధికారులకు నిర్ణీత కొలతల ప్రకారంగా రుసుము చెల్లించాల్సి ఉంది. అనుమతి పొందిన తర్వాతనే మట్టితవ్వకాలు చేయాల్సి ఉంటుంది. పర్యావరణానికి ముప్పువాటిల్లకుండా, చుట్టుపక్కల రైతులకు ఇబ్బంది కలిగించకుండా కేవలం మీటరులోతు మాత్రమే మట్టిని తవ్వాల్సి ఉంటుంది. పీఎస్‌కే కంపెనీ వారు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా రైతులకు చెందిన ప్రభుత్వ భూముల్లో మూడు మీటర్ల లోతు మేర మట్టిని తవ్వి రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా మట్టి తవ్వకాల కోసం తాము ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి మట్టితవ్వకాలకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వపు విద్యార్థులు

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల (2002–2003 టెన్త్) ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకేవేదికపై చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయితిమ్మయ్య, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ శివశంకర్ రెడ్డి, లతీఫ్ బాషా, వెంకటచెనన్నప్ప, ఉపాధ్యాయులు ఉమామహేశ్వర రెడ్డి, సాలమ్మ, రామకృష్ణ, ఫయాజ్, విజయరాజు, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.